క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న దంపతులు

పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామంలో గల సోమప్ప కాలనీలో త్రినాథస్వామి 25వ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగువాడ, కొరసవాడ, తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సత్కారం



సాయిని సత్కరిస్తున్న వెంకయ్యనాయుడు

నరసన్నపేట: విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటూ.. అవసరమైనవారికి ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు కృషిచేస్తున్న నరసన్నపేటకు చెందిన ఊణ్ణ సాయికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభినందించారు. విజయనగరం జిల్లాలోని మంగళపాలెం గురుదేవ్ చారిటబుల్ ట్రస్టుకు వెంకయ్యనాయుడు శనివారం విచ్చేశారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న సాయిని సత్కరించారు. ఇదే స్ఫూర్తితో మరింతగా తన సేవలు అందిస్తానని సాయి తెలిపారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. ఖరీఫ్ సీజన్‌కు చెందిన ధాన్యం నిల్వలు ఉన్నప్పటికీ లక్ష్యం పూర్తయిందని చెప్పి అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేపట్టడం లేదని ఎమ్మెల్యే దృష్టికి పలువురు రైతులు తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఫోన్లో జిల్లా అధికారులతో మాట్లాడారు. ఆమదాలవలస నియోజకవర్గ రైతులపై నిర్లక్ష్యం చూపడం మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

ఐక్యంగా పోరాడాలి



అప్పన్నను సత్కరిస్తున్న రెల్లి గ్రూప్ కులాల సంఘం సభ్యులు

సారవకోట: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు ప్రాధాన్యం కల్పించాలని ఏపీ రెల్లి గ్రూప్ కులాల రాష్ట్ర అధ్యక్షుడు గండి విజయకుమార్ కోరారు. శనివారం మండలంలోని అలుదు గ్రామంలో ఏపీ రెల్లి గ్రూప్ కులాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టే సమయంలో రెల్లి కులస్తులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. దీని కోసం రెల్లి కులస్తులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఎస్సీ విజిలెన్స్ సభ్యుడిగా నియమితులైన కళింగపట్నం అప్పన్నను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి మోహన్‌రావు, మండల కమిటీ అధ్యక్షుడు కుప్పిలి కిశోర్, కార్యదర్శి కళింగపట్నం దాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పల్లకీ సేవ



బాబా విగ్రహం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో గల సమర్థ సద్గురు సాయినాథ మందిరం 20వ వార్షిక మహోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం బాబా ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ నిర్వహించారు. బాబా మందిరం నుంచి ప్రధాన రహదారి, మార్కెట్ వీధి, పెద్దవీధి మీదుగా ఊరేగించారు. కొరసవాడ, కాగువాడ గ్రామాలకు చెందిన బాబా భక్తులు పాల్గొన్నారు.

దర్గాగా కబ్జా!

- నరసన్న చెరువు గర్భం స్వాధీనానికి ప్రయత్నాలు
- బోగస్ పొజిషన్ సర్టిఫికెట్ చూపి ఆక్రమణ



రోడ్డుకు ఆనుకొని నరసన్న చెరువు గర్భంలో శిథిల భవనాల వ్యర్థాలను వేసిన దృశ్యం

నరసన్నపేట: అక్రమార్కుల కన్ను పడిందంటే చెరువులు, ప్రభుత్వ స్థలాలు కనుమరుగవ్వాల్సిందే. బోగస్ పత్రాలు సృష్టించి దర్జాగా **కబ్జా చేసేస్తున్నారు. రూ.లక్షలు, కోట్లు విలువైన** స్థలాలను **సొంతం చేసుకుంటు**న్నారు. **నరసన్నపేటలో** చెరువుల **ఆక్రమణలు** తొలగించా**లని** ఒకవైపు హైదరాబాద్‌కు చెందిన గరీబ్‌గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రయత్నాలు చేస్తుంటే.. మరో**వైపు** చెరువు గర్భా**లను** కొంతమంది **యథేచ్ఛగా** కబ్జా చేస్తున్నారు. **రాజుల చెరువులో** ఆక్రమణలు తొల**గించాలని గరీబు గైడ్ స్వచ్ఛంద** సంస్థ చెన్నైలోని **ఎన్జీటీ కోర్టులో కేసు వేసింది. ఈ** కేసు ప్రస్తుతం **కోర్టు పరిధిలో** ఉంది. ఇటీవల రాతికర్ర, జలగల చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని ఇదే స్వచ్ఛంద సంస్థ జిల్లా అధికారులకు నోటీసులు కూడా పంపింది. ఈ దశలో నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా 16వ నంబర్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుకు ఆనుకొని గొట్టిపల్లి సర్వే నంబర్ 94/3వ సబ్ డివిజన్‌లో ఉన్న చెరువు గర్భాన్ని ఆక్రమించేందుకు కొంతమంది యత్నిస్తున్నారు. శుక్రవారం రాత్రి నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న శిథిల భవనాల వ్యర్థాలను తీసుకువచ్చి చెరువును కప్పుతున్నారు.

పట్టపగలే బహిరంగంగా చెరువును కప్పడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. ఎంతో విలువైన ఈ స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో గజం స్థలం రూ.లక్షల్లో ఉంది. **రోడ్డుకు ఆనుకొని ఉన్న చెరువు గర్భాన్ని కబ్జా చేసేం**దుకు **ముమ్మర** ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక మహిళ ఈ స్థలం తనదని బోగస్ పొజిషన్ సర్టిఫికెట్ చూపిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎక్కడిదో ఒక సర్వే నంబర్ వేసి పొజిషన్ తనకు ఉందని జిరాక్స్ పేపరు చూపిస్తుంటంతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు మహిళ తాను కూటమి ప్రభుత్వం తాలూకా అని అధికారులను బెదిస్తున్నారు. ఈ స్థలం ఆక్రమణ జరిగితే ఆ ప్రాంతం అంతా పరుల చేతికి చేరుతుందని, దీనిపై రెవెన్యూ అధికారులు కఠినంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా నరసన్న చెరువులో ఆక్రమణలను నిలుపుదల చేయాలని, ఉన్న మేరకైనా హద్దులు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

వీఆర్వో పరిశీలన..

నరసన్న చెరువు గర్భంలో ఆక్రమణలు జరుగుతున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ సత్యనారాయణ వెంటనే సంబంధిత వీఆర్వో శ్యామ్‌ను ఆ స్థలం వద్దకు పంపారు. ఎటువంటి ఆక్రమణలకు పాల్పడవద్దని, ఆక్రమణలు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు

భీష్మ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఏకాహం భజన కాలక్షేపాలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో భూనీలాసమేత రంగనాథస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



నరసన్నపేట: కొల్లవానిపేటలో పూజలందుకుంటున్న దుర్యోధన స్వామి



పాతపట్నం: పాతపట్నంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో భజన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు



నరసన్నపేట: వేంకటేశ్వరాలయంలో విష్ణు సహస్ర పారాయణం చేస్తున్న మహిళలు

అరటి గెలల నీరాజనం



రాములమ్మ పేరంటాలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట గ్రామంలో రాములమ్మ పేరంటాలకు శనివారం స్థానికులు మొక్కులు తీర్చుకున్నారు. మాకివలస, కిళ్లాం, గోపాలపెంట, పోతయ్యవలస గ్రామాల ప్రజలు యాళ్ల రాములమ్మ పేరంటాలను భక్తితో కొలుస్తారు. భీష్మ ఏకాదశి సందర్భంగా చీరలు, అరటి గెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శాలింహాండం యాత్ర రోజున ఏటా రాములమ్మ పేరంటాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా యాత్ర కూడా నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. గోపాలపెంట వద్ద వంశధార నదిలో శాలిహాండం యాత్రీకులు అధిక సంఖ్యలో పుణ్య స్నానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నరసన్నపేట డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్ర, మాకివలస మాజీ సర్పంచ్ యాళ్ల వేణు పాల్గొన్నారు.



పేరంటాల వద్ద అరటి గెలలను కట్టిన భక్తులు

జాతీయ యోగా పోటీల్లో సత్తా



లగుడు లక్ష్మికి అవార్డు, బహుమతిని అందజేస్తున్న అప్పన్న

ఆమదాలవలస: పట్టణంలోని పతాంజలి యోగా శిక్షణ కేంద్రానికి చెందిన పొందిన పలువురు గత నెల 24, 25, 26 తేదీల్లో ఆన్‌లైన్‌లో బెంగుళూర్‌కు చెందిన శివజ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యోగా పోటీల్లో పాల్గొన్నారు. ఆ పోటీల్లో సత్తా చాటినట్లు యోగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లగుడు అప్పన్న శనివారం తెలిపారు. ఈ పోటీల్లో 60–70 ఏళ్ల విభాగంలో ఆమదాలవలసకు చెందిన లగుడు లక్ష్మి, 45 నుంచి 55 ఏళ్ల విభాగంలో ఆమదాలవలసకు చెందిన చింతాడ సుశీల, 70 ఏళ్లకు పైబడిన వారిలో ఎం.కళావతి, 8 నుంచి 12 ఏళ్ల విభాగంలో ఎల్.టి.కృష్ణ, 40 నుంచి 50 ఏళ్ల విభాగంలో రాజ్యలక్ష్మి ప్రథమ బహుమతులు, యోగా ప్రతిభా అవార్డులు సాధించారు. వీరందరికి నిర్వాహకులు పంపిన అవార్డులు, బహుమతులను అప్పన్న అందించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఆనందరావు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని కొత్తూరు మండల అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన గండివలస ఆనందరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

శ్రీముఖలింగం విద్యార్థి ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న రిత్విక్ భరద్వాజ్

జలుమూరు: ఎడ్యుకేషనల్ ఎపిఫనీ మెరిట్ (ఈఈఎంటీ) ప్రతిభా పరీక్షలో శ్రీముఖలింగానికి చెందిన నాయుడుగారి రిత్విక్ భరద్వాజ్ జిల్లాలో ద్వితీయ స్థానం సాధించాడు. ఈ మేరకు రిత్విక్ భరద్వాజ్‌కు విజయవాడలో రెసిడెన్షియల్ స్కూల్ డైరెక్టర్ వి.ఎస్.మస్తానయ్య రూ.4వేలతోపాటు ప్రశంసాపత్రాన్ని శనివారం అందించారు. ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల మంది దరఖాస్తు చేయగా.. మెయిన్స్‌కు 800 మంది అర్హత సాధించారు. రిత్విక్ శ్రీముఖలింగం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రిత్విక్‌కు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విజయవంతం చేయండి

జలుమూరు: ఈ నెల 10న నిర్వహించనున్న జాతీయ నులుపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. శనివారం పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆల్బెండజోల్ మాత్రలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. పర్యవేక్షకులు చిన్నరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చట్టాలపై అవగాహన

పాతపట్నం: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్‌ఐ బి.లావణ్య అన్నారు. మండలంలోని బొమ్మిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనదారులందరికీ ఉపాధి

ఎల్.ఎన్.పేట: జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతీ కుటుంబానికి మార్చి ఆఖరు నాటికి 100 రోజుల ఉపాధి హామీ పని దినాలు కల్పించాలని ఆ పథకం ఏపీఓ వి.శ్రీదేవి సిబ్బందికి శనివారం సూచించారు. వేతనదారులకు ఉపాధి కల్పించడంతోపాటు రైతులకు మేలు జరిగేలా పనులు చేపట్టాలన్నారు. సాగునీటి కాలువల్లో పూడికలు తొలగించటంతోపాటు కాలువలు అభివృద్ధి చేసే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శ్రమశక్తి సంఘాలకు సంబంధించిన మేట్ల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

రఘువర్మకు మద్దతుగా నిలవండి

ఆమదాలవలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఉద్యమ సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.అప్పలనాయుడు కోరారు. శనివారం ఆమదాలవలస పట్టణంలో ఇంటింటికీ వెళ్లి ఉపాధ్యాయులను కలిసి మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ బి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, బి.వి.ఎస్.ఎన్.మూర్తి, పి.సూర్యనారాయణ, ఆమదాలవలస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుందరరావు, బి.మహేష్, ఉపాధ్యక్షుడు ఎ.శివరామకృష్ణ, సరుబుజ్జిలి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామన్న, డి.అనిల్ బాబు, ఉపాధ్యక్షుడు బి.వి.ఎస్.ఎన్.నాయుడు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

మెళియాపుట్టి: స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సాదాసీదాగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఆదినాయుడు మాట్లాడుతూ మండలానికి పలు ఆర్టీసీ సర్వీసులు రద్దు చేశారన్నారు. పెద్దలక్ష్మీపురం, టెక్కలి, మెళియాపుట్టి, నేలబొంతు తదితర గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఆర్టీసీ అధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు శాఖలకు చెందిన అధికారులు వివరాలు వెల్లడించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు, సభ్యులు సహకరించాలన్నారు. ఎంపీడీఓ ఎస్.పి.పండా, జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల నాయకుడు ఉదయ్‌కుమార్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

ఆమదాలవలస: సామాజిక సేవతోనే సంతృప్తి కలుగుతుందని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని పి.ఎన్.కాలనీకి చెందిన దుంపల జగదీష్, స్వప్న దంపతలకు కుమార్తె పుట్టిన సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మంది పేదలకు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు.

రూ.20 వేల విరాళం

ఆమదాలవలస: పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు ఆమదాలవలసకు చెందిన రిటైర్డ్ జూనియర్ పశు వైద్యాధికారి గొల్ల మల్లేశ్వరరావు రూ.20 వేలను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కలిసి అందజేశారు. రిటైర్డ్ ఎంపీడీఓ మునగవలస రవీంద్రబాబు ఉన్నారు.

తిరువీధి..



సారవకోట మండల కేంద్రంలోని శివరామపాత్రుని కోనేరు గట్టుపై ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహ తిరువీధిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని స్వామివారి విగ్రహాలను ఊరేగించారు. మహిళలు ఘటాలతో మండల కేంద్రంలోని పలు వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.

- సారవకోట

వైభవంగా..



జలుమూరు మండలం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని మాఘ మాసం శుద్ధ భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

- జలుమూరు

నిరుపయోగం!



సారవకోట మండల కేంద్రంలో చెత్త సేకరణ కోసం ప్రభుత్వం గత నెలలో ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. ట్రాక్టర్ హెడ్ మాత్రమే పంపించి ఇప్పటివరకు ట్రక్కు అందజేయదు. అప్పటి నుంచి స్థానిక సచివాలయ ఆవరణలో హెడ్ నిరుపయోగంగా ఉంది. ఇప్పటికే ఈ పంచాయతీకి గత ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణకు నాలుగు చక్రాల వాహనాన్ని మంజూరు చేశారు. అది వినియోగంలో ఉండగా.. ట్రాక్టర్ మంజూరు చేసినా ట్రక్కు లేక హెడ్ నిరుపయోగంగా ఉంది.

- సారవకోట

ప్రమాదకర మలుపు



కొత్తూరు మండలంలోని బంకి గ్రామం వద్ద మాతల–రుగడ రోడ్డులోని మలుపు ప్రమాదకరంగా ఉంది. ఒకే దగ్గర ఎక్కువగా మలుపు ఉన్నందున ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

- కొత్తూరు

విచారణకు చర్యలు



హిరమండలం శుభలాయిలో రౌతు అనంతరావుకు చెందిన ఫ్లాట్‌ను, వేరో చోట పొందిన పట్టాను చూపిస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ ఆర్ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు రౌతు అనంతరావు, జగ్గు నాయుడుతోపాటు మరో 8 మంది రిజర్వ్ స్థలాల్లో రెండు చొప్పున ఇళ్ల పట్టాలు పొందారని అదే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు ఇటీవల టెక్కలి ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై టెక్కలి ఆర్డీఓ స్పందించారు. ఈ నెల 7న శ్రీనివాసరావుతోపాటు రెండుచోట్ల ఇళ్ల స్థలాలు పొందిన పది మందిని ఆర్డీఓ కార్యాలయానికి పిలిచి విచారణ చేపట్టారు. కొత్తూరు మండలం మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీ రిజర్వ్ స్థలంలో ఇళ్ల స్థలాలు పొందడంతోపాటు హిరమండలం శుభలాయి ఆర్ ఆర్ కాలనీలో రౌతు అనంతరావు (ఫ్లాట్ నంబర్ 569), గాదెల్ల వెంకటరమణ పట్టాలు పొందారని ఆర్డీఓ దృష్టికి శ్రీనివాసరావు తీసుకెళ్లారు. మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీ రిజర్వ్ స్థలంలో ఇళ్ల పట్టా పొందడంతోపాటు అమదాలవసల మండల గాజులకొల్లివలస ఆర్ఆర్ కాలనీలో రౌతు రాములు, రౌతు చిట్టిబాబు, రౌతు సూర్యనారాయణ, రౌతు శేషగిరి, రౌతు శ్రీహరి, రౌతు కొండలరావు, నగిరికటకం వెంకటరమణ పట్టాలను పొందారని తెలిపారు. ఒకే సీరియల్, ఒకే కీ ఉన్నప్పుడు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పట్టా మంజూరు కావాలని, అలా కాకుండా వీరిలో కొంతమంది వారి కుటుంబ సభ్యుల పేరుతో, మరి కొంత మందికి వారి పేరుతో వేర్వేరుగా పట్టాలు పొందినట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిరమండలం, ఆమదాలవలస తహసీల్దార్ల నుంచి పూర్తి వివరాలు సేకరించాలని కొత్తూరు తహసీల్దార్ రవిచంద్రకు టెక్కలి ఆర్డీఓ ఆదేశించారు.